nipuna
Every Wednesday Free Supplement
05.
1 నవంబర్ 2023
పేజీలు 8

## ఆహార దినోత్సవం

- ప్రపంచ ఆహార దినోత్సవాన్ని అక్టోబర్ 16న నిర్వహించారు. ఈ ఏడాది దీని థీమ్ 'వాటర్ ఈజ్ లైఫ్, వాటర్ ఈజ్ ఫుడ్, లీవ్ నో వన్ బిహైండ్ (నీరు జీవం, నీరు ఆహారం, ఎవరూ వదిలిపెట్టద్దు)'.
- అదేవిధంగా ఇదే అక్టోబర్ 16న ప్రపంచ అనస్థీషియా దినోత్సవంగా నిర్వహించారు. 1846, అక్టోబర్ 16న అమెరికాలోని మసాచుసెట్స్ బోస్టన్‌లోని మసాచుసెట్స్ జనరల్ ఆస్పత్రిలో వైద్యుడు విలియం థామస్ గ్రీన్ మార్టర్ ఈథర్‌ను రోగిపై మొదటిసారిగా ప్రయోగించాడు. ఈ ఏడాది దీని థీమ్ 'అనస్థీషియా అండ్ క్యాన్సర్ కేర్'.

# స్వలింగ వివాహాలు - సుప్రీంకోర్టు తీర్పులు

- ఆచార సంప్రదాయాలు, నైతికత విశ్వాసాలు బలంగా పాదుకున్న భారతీయ సమాజం ప్రజాస్వామిక నడవడిక, హక్కుల వితరణ విషయంలో కూడా అంతే ఉదారంగా ఉంటూ వస్తుంది. ఈ స్వాభావికపరమైన వైవిధ్యత ఒక్కోసారి సామాజిక విలువలకు, వ్యక్తిగత హక్కులకు మధ్య సంఘర్షణ ఏర్పరుస్తుంది. అలాంటి సంఘర్షణల్లో ఎల్‌జీబీటీక్యూ వివాహ చట్టబద్ధత అంశం.

### ఎల్‌జీబీటీక్యూ అంటే?

- లెస్బియన్ (ఎల్)– ఒక స్త్రీ మరొక స్త్రీ పట్ల లైంగిక ఆపేక్ష (సెక్సువల్ ఓరియంటేషన్) కలిగి ఉండటం.
- గే (జీ)– ఒక పురుషుడికి పురుషుడి పైనే, ఒక స్త్రీకి స్త్రీ పైనే లైంగిక ఆపేక్ష ఉండటం.
- బై సెక్సువల్ (బీ)– ఒక స్త్రీకి గాని, పురుషుడికి గాని స్త్రీ పురుషులిద్దరి పట్ల లైంగిక ఆపేక్ష ఉండటం
- ట్రాన్స్‌జెండర్ (టీ)– శారీరక లక్షణాలు కలిగి ఉన్న జెండర్‌కు విరుద్ధమైన మానసిక లక్షణాలు కలిగిన వ్యక్తులు. **ఉదా:** పురుష శరీర లక్షణాలు కలిగి ఉండి తమను తాము స్త్రీగా భావించుకోవడం.
- క్వీర్ (క్యూ)– ఎల్‌జీబీటీ వారందరిని కలిపి సంయుక్తంగా ఈ పదాన్ని విస్తృతార్థంలో వినియోగిస్తుంటారు.

### ఐపీసీ సెక్షన్ 377

- స్వలింగ సంపర్కం భారతీయ శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్–ఐపీసీ) సెక్షన్ 377 ప్రకారం భారతదేశంలో అసహజ లైంగిక నేరంగా పరిగణించబడుతూ 2018 వరకు శిక్షార్హ నేరంగా ఉంది. యావజ్జీవ ఖైదు లేదా 10 సంవత్సరాల వరకు జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధించేవారు.
- బ్రిటిష్ కాలం నాటి ఈ వలసల భావజాలాన్ని 'నవతేజ్ సింగ్ జోహర్, ఇతరులు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (2018)'లో కొట్టివేశారు.
- స్వలింగ సంపర్కం ఐపీసీ సెక్షన్ 377 ప్రకారం నేరం కాదని, వారికి ఈ ప్రకరణ వర్తించదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.
- అంతకుముందే 2017లో జస్టిస్ కేఎస్ పుట్టుస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 'ఒక వ్యక్తి తన శరీరంపై సర్వాధికారం (Bodily Autonomy) కలిగి ఉంటాడని, అతని లైంగికాసక్తి కూడా పూర్తిగా అతని ఆంతరంగికమైన స్వేచ్ఛ అని, జీవించే హక్కు (భారత రాజ్యాంగ ప్రకరణ 21)లో ఇది భాగం అని సుప్రీంకోర్టు పేర్కొంది.
- ఈ రెండు తీర్పులు స్వలింగ సంపర్క సమాజానికి పెద్ద ఊరటనిచ్చాయి. నేరం కాదని తేలి తమ జీవనశైలికి చట్టబద్ధత కోరుకున్నారు.



- వివాహ వ్యవస్థలో ప్రవేశించడం ద్వారా లభించే కొన్ని హక్కుల సాధనకు తమ వివాహాలకు చట్టబద్ధత కావాలని దాదాపు 21 మంది పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రధానంగా వారి డిమాండ్లు కింది విధంగా ఉన్నాయి.

1) స్వలింగ సంపర్కుల వివాహాన్ని వారి ప్రాథమిక హక్కుగా గుర్తించి చట్టబద్ధత కల్పించాలి.
2) స్పెషల్ మ్యారేజ్ యాక్ట్–1954లో వివాహం అనేది స్త్రీ, పురుషుడి మధ్య జరిగేదిగా చెబుతున్న 'సెక్షన్ 4'ను రద్దు చేయడం.
3) స్పెషల్ మ్యారేజ్ యాక్ట్, ఇతర చట్టాల్లో జెండర్ న్యూట్రల్ (లింగసమానత్వ) పదాలు చేర్చి, తమ వివాహాలను చట్టబద్ధం చేయడం.
4) దత్తత చట్టం (CARA-Central Adoption Resources Authority)లో మార్పులు తెచ్చి స్వలింగ సంపర్క జంటలకు పిల్లల దత్తత అవకాశం కలిగించడం.

- కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, జమియత్ ఉలేమా–ఇ–హింద్ వంటి సంస్థలు స్వలింగ సంపర్క వివాహాలకు చట్టబద్ధత కల్పించడం ప్రమాదకరమని వాదించాయి. వివాహం అనేది కేవలం ఒక స్త్రీ, ఒక పురుషుడికి మధ్య జరిగేది అని, స్వలింగ వివాహాలు మతపరమైన విలువలకు వ్యతిరేకం, ఇవి పటిష్టమైన భారతీయ కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తాయి అని పేర్కొన్నాయి. పైగా అతి తక్కువ మంది గల మైనారిటీ ప్రయోజనాల కోసం మొత్తం సమాజాన్ని ప్రభావితం చేయలేం. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కావాలనే పిటిషనర్లు కేవలం 'పట్టణ ఆధునిక భావజాలం'గా పేర్కొంటూ అది భారతీయ సంస్కృతి కాదని ప్రతిఘటించాయి.
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ వాదనను తిరస్కరిస్తూ 'క్వీర్' స్వభావాన్ని కలిగి ఉండటానికి ప్రభుత్వం చెప్పినట్లు 'ఇంగ్లిష్ మాట్లాడే పట్టణ వైట్ కాలర్ మెన్' కావాల్సిన అవసరం లేదని, పల్లెల్లో పొలం పని చేసుకునే స్త్రీ అయినా అయి ఉండవచ్చునని, ఇది ఒక సహజ స్వభావం అని ప్రకటించారు.
- కానీ స్వలింగ వివాహాలను (Same Sex Marriage or Civil Union) చట్టబద్ధం చేయడం తమ పరిధిలో లేని అంశమని, అది శాసన వ్యవస్థ (పార్లమెంట్) అధికారంగా పేర్కొంటూ, 5 మంది సభ్యులు గల సుప్రీంకోర్టు ధర్మాసనం 3:2 మెజారిటీతో తీర్పునిచ్చింది. అదేవిధంగా స్పెషల్ మ్యారేజ్ యాక్ట్–1954 అనేది వ్యక్తిగత చట్టాలకు వెలుపల వివాహం చేసుకునేవారికి సంబంధించిందని, లౌకిక తత్వాన్ని ప్రోత్సహిస్తున్న ఈ చట్టంలోని అంశాలను రద్దు చేయడం, వేరే భాష్యాలు చెప్పడం సమంజసం కాదని పేర్కొంది. చట్టాల్లో మార్పులు, చేర్పులు శాసనవ్యవస్థ పని అని పేర్కొంది.
- అయితే సుప్రీంకోర్టు స్వలింగ సంపర్కుల (ఎల్‌జీబీటీక్యూ) హక్కుల విషయంలో ప్రభుత్వానికి, పోలీసులకు కొన్ని మార్గదర్శకాలు (Directives) జారీ చేసింది. అవి..

1) వివాహంతో పాటు వచ్చే కొన్ని హక్కులను హెటిరో సెక్స్ జంట (స్త్రీ పురుష) ఏ విధంగా పొందుతారో, అటువంటి హక్కులు స్వలింగ జంటలు పొందే సంపూర్ణాధికారం వారికి ఉంది. అట్టి హక్కులను నిరాకరించడం అంటే వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమే. సాధారణ ప్రజల వలే క్వీర్ సమాజం కూడా అన్ని ప్రాథమిక హక్కులను కలిగి ఉంటారు.
2) కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రభుత్వాలు స్వలింగ జంటలు ఎలాంటి వివక్షకు గురికాకుండా చర్యలు చేపట్టాలి. వారు ఆహార, వస్తుసేవల పరమైన నిరాకరణలకు గురికాకుండా చూడాలి. సమాజాన్ని క్వీర్ వర్గ హక్కుల గురించి చైతన్యపర్చడానికి చర్యలు తీసుకోవాలి.
3) స్వలింగ జంటల రక్షణ కోసం, ఆశ్రయం కోసం వీరికి అన్ని జిల్లాల్లో షెల్టర్స్ ఏర్పర్చాలి. వారి రక్షణకు హెల్ప్‌లైన్ నంబర్స్ ఏర్పాటు చేయాలి.
4) బలవంతపు లింగ మార్పిడి శస్త్ర చికిత్సలు, హార్మోన్ థెరపీలకు ఏ వ్యక్తీ, ముఖ్యంగా బాలలు గురికారాదు.
5) కుటుంబం నుంచి బయటకు వచ్చిన క్వీర్ వ్యక్తులను పోలీసులు సొంత కుటుంబానికి (Natal Families) తిరిగి వెళ్లమని బలవంతం చేయరాదు. క్వీర్ వ్యక్తుల మనస్తత్వానికి విరుద్ధ లైంగికతను బలవంతంగా వారిపై ఆపాదించడాన్ని నిరోధించాలి. స్వలింగ జంటలు రక్షణ కోరితే, వారి పరిస్థితులు విచారించి రక్షణ కల్పించాలి.
6. ట్రాన్స్‌జెండర్స్ వివాహం చేసుకోవచ్చు. అది చట్టబద్ధమే. ట్రాన్స్‌జెండర్ స్త్రీ, ట్రాన్స్‌జెండర్ పురుషుడు వివాహం చేసుకోవచ్చు. ట్రాన్స్‌జెండర్ స్త్రీ, సాధారణ పురుషుడు లేదా ట్రాన్స్‌జెండర్ పురుషుడు, సాధారణ స్త్రీ వివాహం చేసుకోవడం ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం చట్టబద్ధమే. దీన్ని నిరాకరించడం ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్) యాక్ట్ 2019 ప్రకారం నేరం.
7. మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ కింద క్వీర్ వ్యక్తుల మానసిక సమస్యల పరమైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలి. వారిలో ఆత్మహత్యల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలి.
8. సీఏఆర్ఏ (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) చట్టంలోని 5(3) ప్రకారం ఒక జంట పిల్లలను దత్తత తీసుకోవాలంటే వివాహం అయి ఉండాలి. ఈ నిబంధన స్వలింగ జంటలకు దత్తత హక్కును నిరాకరిస్తూ వారిని వివక్షకు గురి చేస్తున్న నేపథ్యంలో ఈ చట్ట అంశాన్ని సంస్కరించాలి.

- స్వలింగ జంటల హక్కులపై కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీని ఇకముందూ కొనసాగించాలి.
- సుప్రీంకోర్టు తీర్పు ఎల్‌జీబీటీక్యూ వర్గాలు ఆశించిన వివాహ చట్టబద్ధతను వారికి అందించలేకపోయినా ఆ దిశగా కొంత మార్గదర్శనం చేసింది. ఈ పిటిషన్లలో వాద ప్రతివాదాలను ప్రత్యక్ష ప్రసారం చేసి సమాజానికి విషయపర అవగాహన ఏర్పర్చడానికి కృషి చేసింది సుప్రీంకోర్టు.
- అంతేకాకుండా న్యాయవ్యవస్థ అతిక్రియాశీలతను చూపకుండా, అధికారం విభజన పరిధులను గౌరవిస్తూ శాసన వ్యవస్థపై నిర్ణయం తీసుకోవాల్సిన గురుతర బాధ్యతను మోపింది.
- అయితే ఎల్‌జీబీటీక్యూ వర్గం మాత్రం ఈ పరిణామం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.




### ఎల్‌జీబీటీక్యూ వాదన

1) స్వలింగ వివాహాలకు చట్టబద్ధత లేకపోవడం వల్ల వారు కొన్ని సాధారణ హక్కులను సైతం పొందలేకపోతున్నారు. జీవిత భాగస్వామితో కలిసి పిల్లలను దత్తత తీసుకురావడం, ఆరోగ్య బీమా, జీవిత బీమాల్లో భాగస్వామిని లబ్ధిదారుగా చేర్చలేకపోవడం, పౌరసత్వం, వారసత్వం, ఆస్తి హక్కు వంటివి వారి జీవిత భాగస్వామి పొందలేకపోవడం జరుగుతుంది. అంతేకాక స్వలింగ జంటల్లో ఏ ఒక్కరు పిల్లల్ని దత్తత తీసుకున్నా రెండో వారి వారసత్వం, ఆస్తి వంటి హక్కులను పిల్లలు పొందలేకపోతున్నారు. కారణం స్వలింగ వివాహాలకు చట్టబద్ధత లేకపోవడమే.
2) చట్టబద్ధత ద్వారానే సామాజిక సమ్మతి నెమ్మదిగా లభిస్తుంది. దాడులు తగ్గుతాయి. ఉదాహరణకు వితంతు పునర్వివాహాలు, సతీసహగమనం నిషేధం, విడాకుల చట్టం వంటివి తొలుత తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్నప్పటికీ క్రమంగా సంపూర్ణ అనుమతి పొందాయి. అదేవిధంగా జంతుబలుల నిషేధ చట్టం, ప్రార్థనా మందిరాల్లోకి స్త్రీల ప్రవేశానికి సమాన హక్కు ఉందన్న తీర్పుల వంటి సమాజ ఆచరణను పూర్తిగా మార్చకపోయినా ఆ దిశగా క్రమంగా చైతన్యాన్ని తీసుకువస్తున్నాయి. మతపర విషయాల్లో రాజ్యం జోక్యం చేసుకున్న సందర్భాలే ఇవి.
3) ట్రిపుల్ తలాఖ్ వంటి వ్యక్తిగత చట్ట అంశాల్లో మార్పులు తెచ్చి, యూనిఫామ్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి) దిశగా ఆలోచిస్తున్న ప్రభుత్వం స్వలింగ వివాహాలకు మాత్రం వ్యక్తిగత చట్ట సంబంధం చూపడం శోచనీయం. వివాహేతర సంబంధం నేరం కాదని ప్రకటించినప్పుడు అడ్డురాని నైతిక విలువలు స్వలింగ వివాహాలకు అనుమతించడంలో ప్రభుత్వానికి అడ్డుపడటం గర్హనీయం.
4. స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేయకపోవడం, రాజ్యాంగం ప్రసాదిస్తున్న ప్రాథమిక సమానత్వ హక్కు, స్వేచ్ఛా స్వాతంత్ర్య హక్కు, జీవించే హక్కులను ఎల్‌జీబీటీక్యూ వ్యక్తులకు నిరాకరించడమే. ఇది విస్పష్టంగా ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే.
5. స్వలింగ వివాహాల వల్ల ఇతరులకు హాని జరగదు. పైగా నేరం కాని ఈ విషయాన్ని చట్టంగా రూపొందించడం వల్ల కొందరి హక్కులు పరిరక్షించబడతాయి. వారిపై శారీరక, మానసిన హింస తగ్గుముఖం పడుతుంది.

మిగతా 6వ పేజీలో

**మల్లవరపు బాలలత**
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ,
హైదరాబాద్

